క్లుప్తంగా

శివాలయాల్లో పూజలు

దెందులూరు: చిన్న కాశీగా ప్రసిద్ధిగాంచి పూజలు అందుకుంటున్న చల్ల చింతలపూడిలోని శ్రీ మేధా దక్షిణామూర్తి శివరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి శ్రీమన్నారాయణ, మాజీ వార్డ్ మెంబర్ వేమన నాగరాజు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు జోగన్నపాలెం, పోతునూరు, కొవ్వలి, గంగన్నగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. చల్ల చింతలపూడి శివాలయంలో పాటేమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాస రావు స్వామివారికి పూజ చేశారు.

ప్రసాదం పంపిణీ

అచ్చమ్మ పేరంటాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గాలాయగూడెం బస్టాండ్ సెంటర్ ఎదుట ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వెళ్లిన దాదాపు 5,000 మంది పైగా భక్తులకు ప్రసాదం, తాగునీరు పంపిణీ చేశారు.

వైభవంగా నల్ల మారెమ్మ సంబరం



జాతరలో కథ చెబుతున్న చిట్టియ్య

భీమడోలు: భీమడోలులో 12 ఏళ్లకు ఒకసారి వచ్చే నల్ల మారెమ్మ జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. మేళ తాళాల నడుమ గణాచారులు ఆడిపాడారు. పూనకాలు పూనారు. పంబలి వారు తంగిలి రాల చిట్టియ్య నల్లమారెమ్మ వేషధారణలో సంబరం నిర్వహించారు. పంబలి వారు జాతర కథను వివరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి సంబరాన్ని తిలకరించారు. అమ్మవారికి భారీ ఎత్తున సమర్పించిన నైవేద్యాన్ని ఆరగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్యోగుల తొలగింపు నిర్ణయం సరికాదు



ఎల్వీ సాగర్

దెందులూరు: రెవెన్యూ ఉద్యోగులను తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఏపీ ఎన్జీఓల రాష్ట్ర నాయకుడు ఎల్వీ సాగర్ హెచ్చరించారు. బుధవారం ఆయన దెందులూరులో ఉద్యోగుల సమస్యలపై ఆరా తీశారు. ఎన్నికల ముందు ఉద్యోగుల డీఏ పెండింగ్ విడుదలకు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడిచినా డీఏ బకాయిలు చెల్లించకపోవడం పూర్తిగా మోసపూరితమే అన్నారు. తహశీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లను ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తొలగించనున్నారని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేలా తీర్పు ఇవ్వాలని ఉద్యోగులను కోరారు.

రోడ్డు మార్జిన్ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న డేవిడ్

దెందులూరు: స్థానిక అప్పారావుపాలెం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా మార్జిన్ పనులు చేపట్టారు. అప్పారావుపాలెం బస్టాండ్ వద్ద నుంచి గ్రామం లోపల వరకు రోడ్డు మార్జిన్ పనులను దెందులూరు హరిజన క్రైస్తవ కోపరేటివ్ ఫిషరీస్ సొసైటీ చైర్మన్ తోట డేవిడ్, బోర్డు సభ్యులు నేతల ఏసు, రైతు కామిరెడ్డి శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

గుర్తింపు రద్దు సరికాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించే అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేపీ ప్రసాద్ విద్యాశాఖాధికారులను కోరారు. వచ్చే నెలలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమౌతున్న పదో తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ ఉపాధ్యాయ సంఘాలకు కొమ్ము కాసే విధంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతోపాటు పరీక్షలకు సిద్ధం చేస్తున్న యాజమాన్యాల గుర్తింపు రద్దు చేస్తామని ఉత్తర్వులు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు.

వరకట్న వేధింపుల కేసు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. మండలంలోని పంగిడిగూడేనికి చెందిన సింహాద్రి శేషారెడ్డి, సుబ్బలక్ష్మిలకు 12 సంవత్సరాల క్రితం వివాహమైందని తెలిపారు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం, సారె, ఆడపడుచు కట్నం మరో రూ.2 లక్షలు తన తల్లితండ్రులు ఇచ్చినట్లు సుబ్బలక్ష్మి ఫిర్యాదులో పేర్కొందన్నారు. అయితే అదనపు కట్నం తీసుకురమ్మని తనను మానసికంగా, శారీరకంగా భర్త శేషారెడ్డి, అతడి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హరహర మహాదేవ.. శంభో శంకర

- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు

భీమడోలు: హర హర మహాదేవ.. శంభోశంకరా అంటూ భక్తుల శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు బుధవారం తెల్లవారు జామున నుంచే భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. భీమడోలులోని 1200 ఏళ్ల నాటి పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గుండుగొలను భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయంలో స్ఫటికలింగ దర్శనం, రుద్రాభిషేకాలు, శిఖర సాగదర్శనం, కోటి దీపోత్సవం, జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పోలసానిపల్లి రామలింగేశ్వర స్వామి, పూళ్ల సకలేశ్వర స్వామి, అంబర్‌పేట శ్రీస్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అంబర్‌పేట ఆలయంలో అన్నసమారాధన ఏర్పాటుచేశారు. పూళ్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



భీమడోలు : శివాలయంలో క్షీరాభిషేక పూజలు చేస్తున్న పూజారి

బారులు తీరిన భక్తులు

గణపవరం: గణపవరం, పిప్పర, సరిపల్లె, కొమ్మర, కేశవరం, కాశిపాడు, చిలకంపాడు, మొయ్యేరు, జల్లికాకినాడు, అర్ధవరం కొందేపాడు తదితర గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గణపవరం సువర్ణేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకుడు చెరుకూరి మణిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కొట్టు సీతారామరాజు కుటుంబీకులు ఆలయానికి మూడు వెండి శఠగోపాలను సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ పర్యవేక్షించారు. పిప్పర సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏకాదశ మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. గ్రామానికిచెందిన భక్త బృందం సభ్యులు భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.



భీమడోలు : గుండుగొలనులో శివలింగానికి అన్నాభిషేకం

మార్మోగిన శివనామస్మరణ

ఉంగుటూరు: ఉంగుటూరు పార్వతీ భీమేశ్వరస్వామి ఆలయ వేకువ జాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. ఉత్సవ కమిటీ చైర్మన్ నారాయణం హనుమంతురావు, ఆలయ ఈఓ కలగర శ్రీనివాసరావుల పర్యవేక్షణలో పూజలు చేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పార్వతీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు వేద మంత్రాలతో అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. నారాయణపురం, చేబ్రోలు, కైకరం, బాదంపూడి, కంసాలిగుంట, నాచుగుంట, చింతాయిగూడెం బొమ్మిడి, రాచూరు, శివాలయాల్లో స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.



భీమడోలు : గుండుగొలనులో పూజలు అందుకున్న స్వామి వార్లు

పంచాయితన క్షేత్రంలో విశేష అభిషేకాలు

నిడమర్రు: మండలపర్రు గ్రామంలో ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు, సమిత దంపతుల ఆధ్వర్యంలో బుధవారం వేకువజాము నుంచి గురువారం వేకువ జాము వరకు ప్రత్యేక పూజలు చేశారు. నీలకంఠేశ్వరునికి మహారుద్రాభిషేకం, బిళ్వసహస్రనామార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, నవగ్రహ, రుద్ర హోమాలు నిర్వహించారు. సుబ్బరాజు దంపతులచే శివ పార్వతి కల్యాణం జరిపించారు. లింగోద్భవ సమయంలో విశేష అభిషేకాలు చేశారు. ఆలయం వద్ద ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు జరిగిన అన్నసమారాధనలో సుమారు 12 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదిరాజు సుదర్శన వర్మ దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నిడమర్రు : విశేష అలంకరణలో ఉమా నీలకంఠేశ్వరస్వామి

రాజుపేటలో..

పెదపాడు : రాజుపేట రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ సింగిల్ ట్రస్టీ జి.రామలింగేశ్వర రావు ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పెదపాడు గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి, సత్యవోలు శివాలయం, వసంతవాడ అమృత లింగేశ్వరస్వామి, శివాలయం, అప్పనవీడు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



భీమడోలు : అంబర్‌పేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



గణపవరం : సువర్ణేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు



ఉంగుటూరు : భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు



నిడమర్రు : పంచాయతన క్షేత్రంలో కల్యాణం నిర్వహిస్తున్న గాదిరాజు దంపతులు

భక్తులతో కిటకిటలాడిన బలివే



బలివేలో పూజలు చేస్తున్న భక్తులు



బలే రామలింగేశ్వరున్ని దర్శించుకునేందుకు పోటెత్తిన భక్తులు



బలివేలో కిటకిటలాడిన భక్తులు



బలివేలో జల్లు స్నానమాచరిస్తున్న భక్తులు



బలివేలో తిరునాళ్ల వద్ద అన్నదానం



బలివే భక్తులకు అల్పాహారం అందిస్తున్న చిన్నారులు

పెదవేగి : మహాశివరాత్రి పర్వదినాన బుధవారం వేకువజాము నుంచే మండలంలోని విజయరాయి శివారు బలివే భక్తులతో కిటకిటలాడింది. ప్రముఖ పుణ్యక్షేత్రం బలివే రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఏలూరు జిల్లాతోపాటు పశ్చిమ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. క్షీరా రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని, లింగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన నిర్వాహకులు దుశాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందించారు. ఈ ఏడాది మూడు లక్షలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. మండలంలోని పెదవేగి, విజయరాయి, కొప్పాక, వంగూరు, రామశింగవరం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివయ్య సేవలో విద్యార్థులు

బలువే రామలింగేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు విజయరాయికి చెందిన విద్యార్థులు తమ పాకెట్ మనీతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 500 మంది భక్తులకు రవ్వ కేసరి పులిహోర, మజ్జిగ, రస్నా వాటర్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు బెగ్గాని భార్గవ్ రామ్, రాజశేఖర్, చిట్టి బొమ్మ వినయ్, అల్లాడి గిరి, రాజులపాటి పాండురంగారావు, బద్రీనాథ్, ఇమ్మంది రోహిత్ కుమార్, ప్రవీణ్, పామర్తి స్వామి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

● సర్వమత సమ్మేళనానికి ప్రతీక



మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏలూరు తూర్పువీధి సాయిబాబా మందిరం నుంచి భక్తులు ద్వారకాతిరుమలకు సాయినాథుని రథయాత్ర చేపట్టారు. ఈ యాత్ర బుధవారం పెదవేగి మండలం ముండూరు గ్రామం వచ్చేసరికి ముండూరు బరకాత్ మసీదు అధ్యక్షుడు షేక్ షాజహాన్ ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డులో సాయినాథుని రథాన్ని లాగి ఆకట్టుకున్న దృశ్యమిది. ఇది సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తుంది. అనంతరం ముండూరు, సీతాపురం, చక్రయిగూడెం, వేగివాడ, తాళ్లగోకవరం, కె.కన్నాపురం గ్రామాల మీదుగా రథయాత్ర ముందుకెళ్లింది. - పెదవేగి

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

భీమడోలు: గురువారం నిర్వహించే ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ బూత్‌ల వద్దకు ఎన్నికల సామగ్రిని బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో ఏలూరు నుంచి తీసుకొచ్చారు. భీమడోలు పంచాయతీ కార్యాలయంలో పీఎస్ నెం.322లో 522 మంది, భీమడోలు నెం.1 పాఠశాలలో 321లో 557 మంది, 323లో 502 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు నిలవడంతో జంబో బ్యాలెట్ పత్రాన్ని సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణపై అధికారులకు తహసీల్దార్ బి.రమాదేవి దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేస్తున్నారు. బూత్‌ల్లో వెబ్ కెమెరాలను ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేసినట్టు సీఐ బి.సత్యనారాయణ తెలిపారు. ఓటర్లను కూటమి నేతలు పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సమాచారం.



భీమడోలు పాఠశాలలో ఎన్నికల సామగ్రి పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

పోలింగ్‌కు 3 కేంద్రాలు

పెదపాడు : ఎమ్మెల్సీ ఎన్నికలకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 328 పోలింగ్ కేంద్రంలో 735 మంది, 329లో 735 మంది, 330లో 764 మంది ఓటేయనున్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఉంగుటూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో మూడు పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. పోలింగ్ కేంద్రం 318లో 466 మంది. 319 కేంద్రంలో 596 మంది, 320 పోలింగ్ కేంద్రంలో 568 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం వారు సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని ఓటర్లకు సూచించారు.

రోడ్లే పశువులకు ఆవాసం



రాత్రివేళల్లో రోడ్డుపై పడకేసిన పశువులు



గణపవరంలో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

- ప్రయాణికులకు పాట్లు
- గణపవరంలో తరచూ ప్రమాదాలు

గణపవరం: పశువులకు రోడ్లు ఆవాసాలుగా మారాయి. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో పశువులు రోజంతా రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ఒక్కసారిగా వాటిలో అవే పోట్లాడుకుని బాటసారులు, వాహనచోదకులపైకి దూసుకురావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అవి రోడ్లపై పడకేయడంతో ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై పడకేసిన పశువులను గుర్తించేలోపే వాహనాలను వాటిని ఢీకొంటున్నాయి. పశువులతోపాటు వాహనచోదకులూ గాయాలపాలవుతున్నారు.

స్పందించని పశుపోషకులు

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు తప్పవని, వాటిని గోశాలలకు తరలిస్తామని సంబంధిత అధికారులు హెచ్చరిస్తూ, నోటీసులు ఇస్తున్నా పశువుల యజమానుల్లో స్పందన ఉండటంలేదు. వారు ఉదయం, సాయంత్రం పశువులనుంచి పాలు పితుక్కుని తర్వాత వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. వీటితో పాటు పాలివ్వని, వట్టిపోయిన, మగ పశువులను మేపడం దండగన్న ఉద్దేశంతో రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు, బజారుకువచ్చే మహిళలు ప్రాణాలను అరచేత పట్టుకుని రోడ్డుపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పశు వుల బారి నుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు ఇలా..

రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో గణపవరం ఎస్సై హరికృష్ణ ఏలూరు నుంచి గణపవరం వస్తుండగా రాత్రి సమయంలో నిడమర్రు వద్ద రోడ్డు మలుపులో పడుకుని ఉన్న పశువులను గుర్తించేలోపు జీపు ఢీకొట్టింది. దీంతో జీపు తిరగబడి ఎస్సై హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు.

- గణపవరం సెంటర్‌లో ఇటీవల రెండు ఆవులు పోట్లాడుకుంటూ మోటార్ సైకిళ్ల్‌పై పడటంతో ఆ దంపతులు గాయపడ్డారు.
- గణపవరం బొబ్బిలి వంతెనపై పడుకున్న పశువును మోటార్ సైక్లిస్టు ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.
- బువ్వనపల్లిలో ఆబోతు రోడ్డుపై వెళ్తున్న మహిళలపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఉపాధి హామీ కూలీలు ఆబోతును అదిలించడంతో ఆమెకు గండం తప్పింది.
- టెలిఫోన్ ఎక్చేంజి వద్ద రోడ్డుపై పడుకున్న పశువుల గుంపుపైకి బైక్‌పై దూసుకెళ్లడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.
- పశువులపై వాహనాలు దూసుకెళ్లి చనిపోవడం, వాటికాళ్లు విరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి.

రోడ్లపైనే తిష్ట

గణపవరం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. భీమవరం రోడ్డు, ఏలూరురోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్లపై నిరంతరం పశువులు సంచరిస్తూనే ఉంటాయి. బస్టాండు, బొబ్బిలి వంతెన, శేష్ మహల్, కుమారి సెంటర్, మహాలక్ష్మి సెంటర్, బువ్వనపల్లి టెలిఫోన్ ఎక్చేంజి, సరిపల్లె సెంటర్ తదితర ప్రాంతాల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉంది.

నోటీసులు ఇస్తున్నాం

గణపవరంలో రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులను గుర్తించి వారికి నోటీసులు ఇస్తున్నాం. ఇప్పటికే కొంతమేర పశువులను రోడ్లపైకి వదలకుండా కట్టడిచేశాం. చాలా పశువులకు యజమానులు లేరు. పాలివ్వని, మగ, దానం ఇచ్చిన పశువులను రోడ్లపై వదిలేస్తున్నారు. వీటిని పట్టణానికి దూరంగా తరలించడానికి ప్రయత్నిస్తున్నాం.

– డి.శివరామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, గణపవరం

వైభవంగా రామకోటి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. 10.30 గంటల నుంచి పార్థివ లింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకుడు పైడి భీమేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాడా రామారావు దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. రాత్రి నగరానికి చెందిన స్వర్ణ నృత్యాలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి కె.స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి.



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పైడి భీమేశ్వరరావు దంపతులు



పేరయ్య కోనేరు ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న స్వర్ణలత శిష్య బృందం